
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## అర్హులందరికి గృహాలు అందిస్తాం



**వరికుంటపాడు,నవంబర్ 2,ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలు అందజేస్తామనీ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రంగవరప్రసాద్ అన్నారు.మండలంలోని తూర్పు చెన్నంపల్లి ,వరికుంటపాడు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న గృహా నిర్మాణాలను ఆయన పరిశీలించారు.అలాగే వరికుంటపాడు నందు ఎస్టీ కాలనీ లో నూతనంగా గృహాలు మంజూరు కోసం అర్జీలు పెట్టి ఉండడంతో ఈఈ రంగవరప్రసాద్ విచారించి,త్వరలోనే నూతనంగా గృహాలు మంజూరు చేస్తామనీ హామి ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వేగవంతంగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయనీ,అలాగే లబ్దిదారులు త్వరితిగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలనీ సూచించారు.ఈ కార్యక్రమములో హౌసింగ్ ఎఈ ఎఫ్రాయిమ్,ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## పంట వివరాలను నమోదు చేయాలి



**వింజమూరు,నవంబర్2,ప్రభాతవార్త** :వింజమూరు వ్యవసాయ శాఖ కార్యాలయ పరిధిలో రైతులు సాగుచేస్తున్న పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సి.హెచ్.సుధాకర్‌రాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న కంది, మినుము పంటలను పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వలన ఎండిపోతున్న పంటల వివరాలను ఇ-పంట నమోదు చేయాలన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిలో సిబ్బంది రైతులు పంట వివరాలను నమోదు చేసి రైతుకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎడిఎ లు రామిరెడ్డి, నర్సోజిరావ్, ఎఒ శివనాగప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## సంగం బ్యారేజివద్ద ఇంటెక్‌వెల్ ,పిల్టరేషన్‌ప్లాంట్ నిర్మాణం స్థలం పరిశీలించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



**సంగం నవంబర్ 2 ప్రభాతవార్త** సంగం బ్యారేజి వద్ద ఇంటెక్‌వెల్ పిల్టరేషన్ ప్లాంట్‌ను,నిర్మాణ స్థలాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీకి అమృత్ 2 పథకం కింద 85 కోట్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. కేంద్ర,రాష్ట్ర నిదులతో ఈ పథకం మంజూరు అయినట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామిల ప్రకారం ప్రతి కార్యక్రమాన్ని నెరవేరుస్తున్నట్లు చెప్పారు.ఈ పథకం వల్ల బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రతి ఇంటికి కుళాయి కనక్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో 10వేల650 కుళాయిలతో ప్రతి ఇంటికి మంచినీరు అందించనున్నట్లు తెలిపారు.ఈ పథకం వల్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మున్సిఫల్ మంత్రి సురేష్‌కి,ప్రిన్సిఫల్ సెక్రటరీ శ్రీలక్ష్మిలకు ఆయన ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో ఈ స్కీంకి ఎన్‌ఎస్‌ఆర్ పేరుగా ప్రతిపాదించారు దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలో 5 మంచినీటి ట్యాంకులు ఏర్పాటు చేసి వందకిలోమీటర్ల పైపు లైను వేయనున్నట్లు తెలిపారు.బుచ్చిరెడ్డిపాళెంలో ఎన్నికల హామిల ప్రకారం బుచ్చిరెడ్డిపాళెంని మున్సిపాల్టీగా చేయడం,సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం,కోటి రూపాయాలతో పార్కును అభివృద్ధి చేయడం, సిమెంట్లురోడ్డు,డ్రైన్లు నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు.భవిష్యత్తులో బుచ్చిరెడ్డిపాళెంని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.బుచ్చిరెడ్డిపాళెం ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలని అన్నారు.ఈకార్యక్రమంలో వైసిపినాయకులు వవ్వేరు బ్యాంకు చైర్మన్ యర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, జొన్నవాడ దేవస్ధానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,మోర్ల మురళీ, మండల పార్టీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, సోమశిల ఎస్ఇ,ఇరిగేషన్‌డిఇ అనీల్‌కుమార్‌రెడ్డి,మదు,పలువురు ఇరిగేషన్ అధికారులు పాల్గోన్నారు.

## ఈ నెల 9వ నుండి సౌత్ ఇండియా ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

**ముత్తుకూరు,నవంబర్2,ప్రభాతవార్త** రాష్ట్రవ్యావసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 10వ తేదీన ముత్తుకూరు మండల కేంద్రంగా సౌత్ ఇండియా ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఆర్‌ఆర్ఎం క్లస్ నందు గల వాలీబాల్ కోర్టు నందు నిర్వహించబడును.ఈ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించబడును.ఈ టోర్నమెంట్ సౌత్ ఇండియాకు సంబంధించి ఆంధ్ర,తెలంగాణ,తమిళనాడు,కర్ణాటక మొదలగు రాష్ట్రాల నుండి జాతీయ,అంతర్జాతీయ జట్లు పాల్గొననున్నాయి.పురుషుల విభాగం నఉండి 8జట్లు,మహిళా విభాగం నుండి 4జట్లు తలపడనున్నాయి.ఇందులో పురు షుల జట్లుకు సంబంధించి మొదటి బహుమతి లక్ష రూపాయులు,రెండో బహుమతి 75వేలు,మూడో బహుమతి 50వేలు,నాల్గవ బహుమతి 40వేలు,ఐదవ బహుమతి 20వేలు అదేవిధంగా మహిళా జట్లకు సంబంధించి మొదటి బహుమతి 50వేలు,రెండో బహుమతి 40వేలు,మూడో బహుమతి 30వేలు,నాల్గవ బహుమతి 20వేలుగా ప్రకటించారు.11వ తేదీ సాయంత్రం ఫైనల్ మ్యాచ్ ఫ్లడ్లైట్ల వెలుతురులో ఇఆర్‌ఆర్ఎం క్లబ్ ప్రాంగణంలో నిర్వహించబడుతుందని నిర్వహకులు తెలిపారు.

## కొత్తపల్లి సచివాలయం తనిఖీ

**అనంతసాగరం,నవంబర్2,ప్రభాతవార్త :** మండలంలోని కొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని మండల అభివృద్ధి అధికారి ఎ.మధుసూధన్‌రావ్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీలపై పంచాయతీ కార్యదర్శి జునైద్‌అహ్మద్‌ను వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు చేశారు. ఈకార్యక్రమంలో వాలంటీర్లు, ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లింగంగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం

**అనంతసాగరం,నవంబర్2,ప్రభాతవార్త :** మండలంలోని లింగంగుంట సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ ఎ.మధుసూధన్‌రావ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 3వ తేదీ మధ్యాహ్నం 4గంటలకు బెడుసుపల్లి, లింగంగుంట , 4వ తేదీ బెడుసుపల్లి, లింగంగుంట, 4వ తేదీ గార్లదిన్నెపాడు , ఇనగలూరు గ్రామాల్లో జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైమ్, నవంబర్ 2, ప్రభాతవార్త** వేదయపాలెం రైల్వే స్టేషన్ సౌత్ రైల్వే స్టేషన్‌కి మధ్యలో ఎస్టు సినిమా థియేటర్ సమీపంలో గురువారం 55 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడని సమాచారంతో సంఘటనా స్థలం చేరుకున్న రైల్వే పోలీసులు అనుమానస్పద వ్యక్తి మృతి అనే కోణంలో కేసు నమోదు చేసినట్లు రైల్వే సబ్ ఇన్‌స్పెక్టర్ హరిచందన తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో తగిలిన గాయాల వలన మరణించి ఉంటాడని తమ ప్రాధమిక దర్యాప్తులో తేలిందని, మృతదేహాన్ని శవ పంచనామ కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఒంటిమీద ఆరెంజ్ కలర్ షర్టు, తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నాడని, ఈ వివరాలు ఎవరికైనా తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

# దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చొరవతో రాష్ట్రంలో పరిశ్రమల వెల్లువ







**నెల్లూరు,నవంబర్2,ప్రభాతవార్త :** ఆంధ్రరాష్ట్రంలో దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పరిశ్రమల ఏర్పాటులో తీసుకువచ్చిన సంస్కరణల వలన నేడు పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని డైకస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మేకపాటి గౌతంరెడ్డి కాంస్య విగ్రహాన్ని గురువారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. దివంగత మంత్రి గౌతంరెడ్డి 52వ జయంతి సందర్భంగా జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, ప్రజా ప్రతినిధులు , అభిమానులు స ృత్యంజలి ఘటించారు. జ్యోతి ప్రజ్వలన చేసి గౌతంరెడ్డి దూరమైన నేపథ్యంలో రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలోని కాబినేట్‌లో 5శాఖల మంత్రిగా గౌతంరెడ్డి సమర్ధవంతమైన మంత్రిగా పేరు సంపాదించుకున్నారన్నారు. పరిశ్రమల ఏర్పాటులో సరళీకృత ఆర్థికవిధానాలను నూతన సంస్కరణలను తీసుకువచ్చి పరిశ్రమల స్థాపనకు పెద్ద స్థాయిలో ఔత్సాహికులు ముందుకు వచ్చారన్నారు. ఉదయగిరిలోని కోట్లాదిరూపాయల విలువచేసే ఆస్తులను మేకపాటి కుటుంబం ప్రభుత్వానికి అప్పగించి వ్యవసాయ విశ్వ విదాయలయానికి శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి కాబినేట్ అజెండాలో మొదటి ప్రాధాన్యతాంశంగా చేర్చ ఉదయగిరిలోని మేకపాటి గౌతంరెడ్డి మెమోరియల్ వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అని ్ర అధ్యాపకుల పోస్టులను, సిబ్బందిని , మౌళిక సదుపాయాలను వెనువెంటనే భర్తీ చేయాలని ఆదేశాలను జారీ చేశారన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజ మోహన్‌రెడ్డి మెట్ట ప్రాంతానికి చెందినప్పటికీ నీతి నిజాయితీతో కూడిన విలువైన రాజకీయాలను నడిపి నేడు జిల్లాలో ప్రముఖ కుటుంబాల్లో ఒక కుటుంబంగా పేరు తెచ్చుకున్నారన్నారు. నెల్లూరు జిల్లాలోనే తలమానికంగా ఉన్న సంగం బారేజికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేకపాటి గౌతంరెడ్డి పేరు పెట్టడం వలన జిల్లా రైతుల హృదయాల్లో గౌతంరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. రాజకీయాల్లో ఉండి గౌతంరెడ్డి ఎవరూ వేలెత్తి చూపకుండా చివరి శ్వాసవరకు రాజులా బ్రతికాడన్నారు. గుమ్మనంగా గుండె ధైర్యంతో ఉండే సిఎం జగన్మోహన్‌రెడ్డి అత్యంత సన్నిహితుడైన గౌతంరెడ్డిని కోల్పోయిన రోజు ఎంతో బాధపడడం తాను చూశానన్నారు. గౌతంరెడ్డి ప్రచారం తక్కువ - పని ఎక్కువగా ఉండడం రాజకీయాల్లో అరుదైన విషయమని స్పష్టం చేశారు. గౌతం లాగే ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కూడా విభిన్న శైలి, మనస్తత్వం , పనితీరు అన్నలాగే నిశ్శబ్ధంగా అనుకున్నవి చేసుకుంటూ ముందుకు వెళుతున్నారని మంత్రి కితాబిచ్చారు. నెల్లూరుసిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, మంచి పెంపకం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక చెరగని గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. జిల్లాలో గౌతం అన్న పరిశ్రమల శాఖామంత్రిగా , తాను ఇరిగేషన్ శాఖామంత్రిగా ఇద్దరి సమన్వయంతో జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేశామని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించినప్రతి కార్యక్రమంలో తాను వెనుకుండి జిల్లాలో తనను ముందుండి నడిపించిన నిగర్వి మేకపాటి గౌతం అన్న అంటూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ భావోద్వేగంగా మాట్లాడారు. ఆత్మకూరు శాసన సభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గౌతం అన్న హామీలను నెరవేర్చడమే తన ఆశయమన్నారు. అనుకున్న నెలలోపే డైకస్‌రోడ్డులో మేకపాటి గౌతం అన్న విగ్రహావిష్కరణ పూర్తికావడంలో కృషి చేసి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. మేకపాటి కుటుంబ ప్రతిష్టను మరింత పెంచి రాజకీయాల్లో బెంచ్‌మార్క్‌గా గౌతం అన్న నిలిచారని పేర్కొన్నారు. రాజకీయాల్లో గౌతంఅన్న ఆశయాలు చాలా నిస్వార్థమైనవన్నారు. వాటిని నెరవేర్చి ఆత్మకూరు ప్రజల రుణం తీర్చుకోవడమే తన ఏకైక లక్ష్యమన్నారు. గౌతం అన్న ప్రజలకిచ్చిన మాట నెరవేర్చడంలో ఆలస్యం జరగకూడదనే ఎడిఎఫ్ స్థాపించి ఆత్మకూరు బస్టాండ్‌ను నిర్మించామన్నారు. ఆత్మకూరు ఎంఎస్ఎంఇ పార్క్‌లో త్వరలో 10పరిశ్రమలు ఏర్పాటు చేసేలా సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సభాముఖంగా ప్రకటించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, క ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పూనుగుంట మహీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణచక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరుజిల్లా పరిషత్ చైర్మెన్ అరుణమ్మ, నెల్లూరు మేయర్ స్రవంతి, నెల్లూరు నగర కమీషనర్ వికాస్‌మర్మత్, ఎన్‌డిసిబి మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఉదయగిరి వైసిపి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, దివంగత నేత మేకపాటి గౌతంరెడ్డి తనయుడు మేకపాటి కృష్ణార్జున్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మాదాసు గంగాధర్, ఆత్మకూరు మున్సిపల్ చైర్మెన్ గోపవరం వెంకటరమణమ్మ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# 27 నుండి బాలాయనం



**వింజమూరు,నవంబర్2,ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో వెలసియున్న శ్రీదేవి,భూదేవి సమేత శ్రీలక్ష్మీనర్శింహస్వామి ఆలయంలో ఈనెల 27నుండి 29వ తేదీ వరకు బాలాయనం కార్యక్రమాలను నిర్వహిస్తారని ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి , ఆలయ అభివృద్ధికమిటీ సభ్యులు అంకినపల్లి ఓబులురెడ్డి తెలిపారు . గురువారం నల్లగొండ్ల ఆలయంలో బాలాయనం కార్యక్రమాల అనంతరం దాతల సహకారంతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై టిటిడి ఆలయ ఎఇ , సిబ్బందితో చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 12సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా కుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు బాలాయన కార్యక్రమాన్ని ముందుగా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. గర్భాలయంలోని త్రిమూర్తులైన రంగనాధస్వామి, ప్రధాన అర్చనా స్వరూపుడు శ్రీలక్ష్మీనర్శింహస్వామి, శ్రీ సంతాన వేణుగోపాలస్వామికి బాలాయనంలో జీవకళలను కలశారాధన చేసి అనంతరం ఆలయంలో జరిగే నిత్యవిశేష పూజాకార్యక్రమాలు ఆలయ కలశానికి అర్చకులచే నిర్వహించబడుతుందనా న్నరు. ఆలయ మరమ్మత్తులు సంపూర్ణంగా పూర్తయిన తర్వాత ఫిబ్రవరి నెలలో మహాకుంభాభిషేకం మహోత్సవం జరిపి అంతరాలయంలోని త్రిమూర్తులకు మళ్ళీ జీవకళను ఇస్తారన్నారు. సర్వాంగసుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దిన తర్వాత అర్చనాస్వరూపుడైన శ్రీగుహామల్లీశ్వర లక్ష్మీనర్శింహా స్వామి దర్శనమిస్తారన్నారు. ఆలయంలో గర్భాలయంలో గ్రానైట్ , దేవస్థానం చుట్టూ చాలాగ్రహం, విమాన గోపురం, దేవాలయంపై దేవతామూర్తులు ఏర్పాటు జరుగుతుందన్నారు. ఆలయ ప్రాచుర్యాన్ని దృష్టిలో ఉంచుకొని టిటిడి వారు 36లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో ధ్యానమందిరం, కళ్యాణకట్ట భవనాలను ఏర్పాటు చేసి భక్తులకు సదుపాయలు కల్పిస్తారన్నారు. జిల్లాలోనే ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ ఆలయానికి గతంలో ఆర్థికశాఖామంత్రిగా పనిచేసిన ఆనం రామనారాయణరెడ్డి హయాంలో ఓపెన్ థియేటర్, ప్రస్తుత మంత్రి నాడు జిల్లాపరిషత్ చైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి లు చేసిన సహాయ సహకారాలతో ఆలయానికి రూపురేఖలు వచ్చాయన్నారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , టిటిడి బోర్డు సభ్యులు ప్రశాంతిరెడ్డిల చొరవతో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మహాకుంభాభిషేకానికి అందరూ సహకరించాలని వారు కోరారు. గతంలో ఆలయ ధర్మకర్తలుగా వ్యవహరించిన లెక్కల చిన కొండారెడ్డి, రూపునేని వెంకటేశ్వర్లు నాయుడు, అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి, లెక్కల పెద మాలకొండారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి అందరి సహకారంతోనే ఈఆలయం దినదినాభివృద్ధి చెందిందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటరత్నం నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, ఎఇ మురళీమోహన్ , స్థపతి సురేంద్ర, అర్చకులు పరంకుశం సత్యనారాయణాచార్యులు ,రవిస్వామి, అన్నపురెడ్డి వెంగళరెడ్డి, ఆలయ ఇఒ మల్లిఖార్జునరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విక్స్ ఖోల్ ఇండియా బోల్చీర్ గీతానికి భారీ క్రేజ్

**నెల్లూరు,నవంబరు2 ప్రభాతవార్త-విద్య** దేశంలోని వినికిడి లోపం ఉన్న సుమారు 6.3 కోట్ల మంది క్రికెట్ అభిమానులకోసం తమ సంస్థ విక్స్‌తో కలిసి రూపొందించిన విక్స్‌ఖేలో ఇండియా బో ల్చీర్ గీతానికి భారీ క్రేజ్ రావటం ఖాయమని ఇండియా సైనింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అలోక్ క్రేజీవాల్ పేర్కొన్నారు. గురువారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దిగ్గజ బా ్యట్స్‌మన్స్ యువరాజ్‌సింగ్‌తో కలిసి ఈ గీతాన్ని ప్రదర్శించటం సంతోషంగా ఉందన్నారు. తమ గీతం దేశంలోని 142కోట్లమంది ప్రజల గొంతుకును వినిపిస్తుందన్నారు. దేశాన్ని ఖిచ్‌ఖిచ్ రహితస్వరంగా మార్చులని గతంలో తమ సంస్థ నిర్మి ంచిన గీతానికి దేశ ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ప్రస్తుతం కూడా ఇదే పరిస్థిది రిపీట్ అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. క్రికెట్ స్టార్ యువరాజ్ సింగ్ చేతులమీదుగా ఖోల్ ఇండియా చోల్‌చీర్ గీతాన్ని ఆరిష్కరించి బరిదులకు అంకితం చేయనున్నామని పేర్కొన్నారు. పరస్సల్ హెల్త్‌కేర్ పిఈ ఇండియా కేరగిరి లీడర్ సాహిల్ సేధి మాట్లాడుతు యువరాజ్ సింగ్ సహకారంతో బోల్‌గీతం ఖిచ్‌ఖిచ్ రహిత స ్వరతంతో బిగ్గరగా ఉల్లాసంగా ఉండేందుకు ఈ క్రికెట్ సీజన్ అభిమానులకు అకట్టుకుంటుదన్నారు. దేశంలోని 6.3కోట్లమంది వినికిడి లోపం ఉన్న వారికోసం ఈ గీతాన్ని ప్రత్యేకంగా నిర్మించి విడుదల చేయటం గర్వంగా ఉందన్నారు. వినికిడి లోపం ఉన్న సబ్యులు సైన్ లాంగ్వేజ్‌లోకి వెర్షన్ మార్చి వారి హావభావాల ద్వారా ఉత్సాహపరిచేందుకు ఆటపట్ల వారికి ఉన్న మక్కువను వేడుకను ఆకర్షించేందుకు ఈ గీతం ఉపకరిస్తునందన్నారు. ఇందుకోసం కష్టపడిని వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొ న్నారు.

## బంగారు పతకాలు సాధించిన కొత్తసత్రం విద్యార్థినులు

**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ జంప్రో ఆధ్వర్యంలో తెనాలిలో జరిగిన 19వ నేషనల్ జంప్ రోప్ అండర్ 12లో కావలి రూరల్ మండలం కొత్తసత్రం హైస్కూలు విద్యార్థినులు వై.జ్యోతి 32 స్పీడ్ ఫస్ట్ ప్లేస్, మినిట్స్ ఇండోరెన్స్‌లో పి.సరిత త్రీమినిట్స్ ఇండోరెన్స్‌లో ఫస్ట్‌ప్లేస్ సాధించి బంగారు పతకాలు సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పిడి మురళి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించి రాబోవు రోజులలో మరెన్నో క్రీడల్లో పాల్గొని విజయాలు సాధించాలని కోరారు.




# పశువుల యజమానులకు జరిమానాలు వేయండి



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్2,ప్రభాతవార్త** రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్న పశువుల వలన ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని,వాటిని నియంత్రించకపోతే యజమానులకు భారీ జరిమానాలు విధిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ హెచ్చరించారు.పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక బట్వాడి పాలెం,వాకర్స్ రోడ్డు,మన్సూర్‌నగర్,పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంతాల్లోని శానిటేషన్ మస్టర్ పాయింట్లను కమిషనర్ గురువారం ఉదయం తనిఖీ చేశారు.స్థానిక ప్రజలతో ప్రతిపక్షంగా మాట్లాడుతూ డోర్ టు డోర్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే గృహ వ్యర్థాలను అదించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు.చెత్త వాహనాలకు కాకుండా బహిరంగ ప్రదేశాల్లో,డ్రైను కాలువల్లో చెత్తను వేయడం వలన దోమల వ్యాప్తి పెరిగి అనారోగ్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని అవగాహన కల్పిస్తూ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికి నోటీసులు అందించాలని కార్యదర్శులకు కమిషనర్ ఆదేశించారు.సంతపేట నాలుగు కాళ్ల మండపం ప్రాంతాల్లో కొంతమంది దుకాణదారులు పశువులు రోడ్లపై సంచరించేలా ప్రోత్సహిస్తున్నారని అలాంటి చర్యలు ఆపేయాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకట రమణ,సూపర్వైజర్లు,శానిటేషన్ విభాగం సిబ్బంది,సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

## కావలి నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాం



**కావలి, నవంబరు 2 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలో రానున్న ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి కార్యాచరణ రూపొందించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్,ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు తెలిపారు. కావలి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చింతాల మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు కావలి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులకు ఓటర్ల జాబితాను అందజేయడం జరిగిందన్నారు. దీంతో ఎన్నికల ప్రారంభించామన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు వున్నా, ఎవరైనా చనిపోయి వున్నా తక్షణం సరిచేయించాలన్నారు. ఈ రాష్ట్రంలో వున్న రాజకీయ పార్టీలు అన్ని కూడా ఒకరి మీద ఒకరు పోటీ పడి ఈ రాష్ట్రాన్ని విభజించండని మాకు ఎటువంటి ఇబ్బంది లేదని, తెలంగాణా ప్రజల మనోభావాలను కూడా మేము గౌరవిస్తామని రకరకాలుగా ముందుకు వచ్చి కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ వద్దకు వెళ్లి చెప్పి ఈ రాష్ట్రాన్ని విభజించడం జరిగిందన్నారు. దానిలో అన్ని రాజకీయ పార్టీలు వున్నప్పటికీ ఆ పాపాన్ని కాంగ్రెస్ పార్టీ నెత్తిన వేయడం జరిగిందన్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగిందన్నారు. తెలంగాణాలో ఊపు అందుకొని కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా అధికారంకి వస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పార్టీకి పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్ళపల్లి సురేష్ బాబు, కావలి పట్టణ అధ్యక్షులు అనుమాలశెట్టి వాసు, కావలి మండల అధ్యక్షులు అరగల కరుణాకర్, బోగోలు మండల అధ్యక్షులు తొట్టెంపూడి వెంకట రమణ, జలదంకి మండల అధ్యక్షులు నరేంద్ర చౌదరి, కుంతూరు శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ వెల్ఫేర్ జిల్లా ఆఫీస్‌లో ఉచిత దంత వైద్యశిబిరం




**నెల్లూరు టౌన్, నవంబర్ 2, ప్రభాతవార్త** దంత అవగాహనతో దంత సమస్యలకు రాకుండా ఉంటాయని స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం ఆనందదాయకమని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వై.వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయం, హోమియో హాస్పిటల్, వ్యవసాయ శాఖ, జిల్లా వనరుల కేంద్రం, జిల్లా వయోజన విద్య కార్యాలయం కోఆపరేటివ్, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం తదితర కార్యాలయాల్లో సముదాయం వద్ద స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన దంత అవగాహన సదస్సులో వెంకటయ్య ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ డాక్టర్ భవాని అందరికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి దంతాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. స్మైల్ డెంటల్ మార్కెటింగ్ మేనేజర్ షేక్ హుమయూన్ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం క్రింద తమ హాస్పిటల్‌లో నగదు రహిత దంత చికిత్సల సౌకర్యం ఉందని వివరించారు. ఆరోగ్యకరమైన దంతాలు ఉండే వారు సైతం సంవత్సరానికి ఒకసారి అయిన తప్పక దంత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్యాలయాలకు చెందిన ఉద్యోగులకు ఉచితంగా దంత పరీక్షలు చేశారు. ఈ ఉచిత దంత వైద్య శిబిరంలో ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ సుభాషిణి, ట్రైనీ డీబీసీ డబ్ల్యూఓ శివలీల, బీసీ వెల్ఫేర్ జిల్లా ఆఫీస్ సూపరింటెండెంట్ ఎం.శాంసన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యశాలలో చికిత్స పొందుతున్న సుబ్బారాయుడుకి పెన్షన్ అందజేసిన వాలంటీర్



**బిట్రగుంట, నవంబరు 2 ప్రభాతవార్త** బోగోలు మండలం తాళ్ళూరుకి చెందిన తాళ్ళూరి సుబ్బారాయుడు అనారోగ్యంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ గ్రామ వాలంటీర్ తాళ్ళూరు శ్రీనివాసులు వైద్యశాలకు వెళ్లి ఆయనకు పెన్షన్ నగదు అందజేశారు. దీంతో ఆయన వాలంటీర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్ తాళ్ళూరు శ్రీనివాసులను పలువురు అభినందించారు.

## నరేంద్ర చిన్న పిల్లల వైద్యశాల ప్రారంభం



**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** కావలి క్రిస్టియన్‌పేట 4వ లైన్లో చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ పత్రి నరేంద్ర, డాక్టర్ పొన్నాతి రమ్య దీపికల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నరేంద్ర చిన్న పిల్లల వైద్యశాలను గురువారం ప్రారంభించారు. ఈ వైద్యశాలలోని పలు విభాగాలను తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డిలు ప్రారంభించారు. డాక్టర్లకు ఆశీస్సులు అందజేసి మాట్లాడారు. ఈ వైద్య శాల డాక్టర్ల పర్యవేక్షణలో దినదినాభివృద్ధి చెంది కావలి,పరిసర ప్రాంతాలలోని చిన్నారులకు మెరుగైన వైద్యాన్ని అందించి అందరి మన్ననలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మల్లకుంభా సైక్లింగ్‌కు 24 మంది విద్యార్థులు ఎంపిక



**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** ఎస్‌జిఎఫ్ఐ క్రీడల్లో భాగంగా కావలి రూరల్ మండలం సర్వాయపాళెం జెడ్పీ హైస్కూలులో వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి పర్యవేక్షణలో గురువారం మల్లకుంభా సైక్లింగ్ ఎంపికలు జరిగాయి. అండర్ 14, అండర్ 17, అండర్ 19 విభాగాలలో జరిగిన ఎంపికలలో దాదాపు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 12 మంది బాలురు, 12 మంది బాలికలు మొత్తం 24 మంది ఎంపికయ్యారు. ఈ ఎంపికలకు న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయినీలు చంద్రిక, సులోచనలు వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణ మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన జట్లు నెల్లూరు జిల్లా టీములుగా ఏర్పడి రాష్ట్ర స్థాయిలో పాల్గొని మంచి విజయాలు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** సమాజంలో పెరుగుతున్న అవినీతిని నిర్మూలించడానికి అవినీతి వ్యతిరేక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని లోక్‌అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి తెలిపారు. కావలి పాతవూరు మున్సిపల్ పాఠశాలలో గురువారం అవినీతి వ్యతిరేక విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలకొండారెడ్డి మాట్లాడారు. మన దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి ఒక ప్రధాన అవరోదమని తెలిపారు. ముఖ్యంగా కేంద్రంలో సిబిఐ, సివిసి, లోక్‌పాల్, రాష్ట్ర స్థాయిలో ఎసిబి, లోక్‌సత్తా, సిబిసిఐడి ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో జరిగే అవినీతిని నిర్మూలించడానికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న అవినీతి రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి. సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరు నేను లంచంపుచ్చుకోను,ఇవ్వను అనిఅన్ని పనులను నిజాయి తీతో, పారదర్శకంగా నిర్వహిస్తానని ముందుకు రావాలనికోరారు. విద్యార్థులు,పౌరులు అవినీతివ్యతిరేక చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.ఉపాధ్యాయులుదయలత, మనోహర్, మస్తాన్‌వలి,విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన



**కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త :** బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల పట్ల ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే బాల్య వివాహాలు జరగకుండా ఉంటాయని, దీనికి సంబందించి ప్రజల్లో మరింత అవగాహన పెంచేలా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు నిరోధిచేందుకు ప్రభుత్వం .జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాల పట్ల సమిష్టిగా అవగాహన చేసేలా దృష్టి పెట్టాలన్నారు. ప్రధానంగా ఐసీడీఎస్ , ఆరోగ్య సిబ్బంది బాల్య వివాహాల వలన కలిగే ఏ విధమైన ఇబ్బందులు వస్తాయి అనే విషయాలను వారికి వివరించాలన్నారు. కోవూరు మండలంలో 11 బాల్య వివాహాలు జరిగాయని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమీక్షలో సీడీపీవో జ్యోతి, ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్నలక్ష్మి, మహిళా పోలీసులు ఉన్నారు.

## మహిళలు శారీరకమైన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ



**కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త** :మహిళలు భౌతికంగా మానసింకంగా ఉద్యోగ పరంగా శారీరకమైన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని యోగా టీచర్ డాక్టర్ జేకే స్వప్న అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరాన్ని శక్తివంతం, బలోపేతం చేసే ఆహార పదార్థాలు, ప్రకృతి సిద్ధమైన పాలు, పండ్లు, గింజలు మాత్రమే తీసుకోవాలని సూచించారు. జెంక్స్ ఫుడ్స్‌ను తినడం పూర్తిగా మానివేయాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తగిన వ్యాయామం వలన మహిళలు మరింత చురుకుగా , ఆరోగ్యవంతంగా తయారవుతారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల మహిళా సంక్షేమం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా యోగా టీచర్ డాక్టర్ జేకే స్వప్నను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ టీఎన్‌వీఎల్ఎన్ కుమార్, కళాశాల ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె. విజయ, మహిళా అధ్యాపక సిబ్బంది ఉన్నారు.

## మృతుల ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గం సంబంధించి నూతన ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరిగిందని ప్రతి బీఎల్‌వో మృతుల ఓటర్లకు సంబంధించి ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం. పద్మజ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌వోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన విధులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, సీనియర్ అసిస్టెంట్ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, బీఎల్‌వోలు ఉన్నారు.

## సీస్ పరీక్షను పటిష్టంగా నిర్వహించాలి



**కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త** :విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు నవంబర్ 3వ తేది నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే-2023 పరీక్షను పటిష్టంగా నిర్వహించేలా దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మతో కలిసి ఈ పరీక్షకు సంబంధించి సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం కోవూరు మండలంలో 48 కేంద్రాల్లో 1285 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారన్నారు. ముఖ్యంగా ఈ పరీక్ష యొక్క ఉద్దేశం విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను మరింత మెరుగైన ఫలితాల సాధన కోసం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించేలా సమిష్టి కృషి అవసరమన్నారు.

## జేకే రెడ్డికి ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ

**కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త :** నెల్లూరు మాజీ ఎమ్మెల్యే జేకే రెడ్డి సతీమణి సులోచనమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు గురువారం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి జేకేరెడ్డిని సరామర్శించి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సమయంలోనే గుండె దిటవు చేసుకుని ధైర్యంగా ఉండాలని ఆయన ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఇందుకూరుపేట బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డిలు ఉన్నారు.

## యాజమాన్యం మొండి వైఖరి వీడకపోతే పనులు స్తంభింపజేస్తాం




కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త : ఇనమడుగు హమాలీ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించక యాజమాన్యం మొండి వైఖరి చూపితే పూర్తిగా పనులు ఆపివేసేలా చర్యలు తీసుకుంటామని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. ఇనమడుగు హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బజార్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఇనమడుగు సెంటర్ హమాలీ కార్మికులు గత నెల రోజులుగా సమ్మె చేస్తున్నా యాజమాన్యం మొండి గా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ తీరు మార్చుకుని హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పక్క గోదాముల్లో ఇస్తున్న కూలీని ఇవ్వాలని అడుగుతున్నామే తప్ప మరేమీ లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఎం. పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి జే. నాగేశ్వరరావు, సీపీఎం నగర కార్యదర్శి కె. శ్రీనివాసులు, సీపీఎం మండల కార్యదర్శి పి. శేషయ్య, నేతలు పి. సూర్యనారాయణ, సీహెచ్ దామోదర్‌రెడ్డి, రాంబాబు, సుధాకర్, చాన్ బాషా, పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు ఉన్నారు.

## ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబరు 2 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి సంబందించి ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం జరిగిందని, దీనికి సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రం ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్‌వోకు ఇవ్వాలని నుడా వైస్ చైర్మన్ , కోవూరు ఎన్నికల అధికారి బాపిరెడ్డి అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాత్రి కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన తహసీల్దార్లు పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4,5 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం జరుగుతుందని, దీనిపై ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా 10 మందికి మించి ఒకే డోర్ నెంబర్ ఓటర్లు నమోదు అయి ఉంటే అటువంటి వారిని మరోసారి నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా ఎటువంటి డోర్ నెంబర్ లేకుండా జీరో డోర్‌తో ఉన్న ఓటర్ల వివరాలు కూడా మరోసారి పరిశీలించాల్సి ఉంటుందన్నారు. అనంతరం మండలాల వారీగా బూత్ లెవల్ సూపర్‌వైజర్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో తహసీల్దార్లు ఎం. పద్మజ, సీహెచ్ సుబ్బయ్య, వి. సుధీర్, ఐదు మండలాలకు సంబంధించిన పోలింగ్ బూత్ సూపర్‌వైజర్లు ఉన్నారు.

## వీర ఓల్డ్‌ఏజ్ హోమ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

**నెల్లూరు టౌన్, నవంబర్ 2, ప్రభాతవార్త** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని వీర ఓల్డ్ ఏజ్ హోమ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓల్డ్ ఏజ్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులను పలకరించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు తాను ఈ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్, తల్లిదండ్రులు రక్షణ, పోషణ తల్లిదండ్రులను కుటుంబంలోని ఇతర వయోవృద్ధులను, వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. చాలా మంది తల్లిదండ్రులను, వృద్ధులను, సీనియర్ పౌరులను, బిడ్డలు, బంధువులు నిర్లక్ష్యం చేయడం ఇంటి నుండి బయటకు గెంటి వేయడం జరుగుతుందని వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వీరి రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వృద్ధాప్యంలో ఇలాంటి వారి రక్షణ కోసం 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల సీనియర్ సిటిజన్ల పోషణ సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండిబి సుబ్బాయమ్మ, సిస్టర్ సుమలత, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగల విశ్వరూప మహాసభకు వేలాది మంది తరలి రావాలి

**నెల్లూరు టౌన్, నవంబర్ 2, ప్రభాతవార్త** మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 11న ఛలో హైదరాబాద్‌లో జరిగే మాదిగ విశ్వరూప మహాసభను నెల్లూరు జిల్లా నుండి వేలాది మంది మాదిగలు హాజరై విజయవంతం చేయాలని ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ పిలుపునిచ్చారు. నెల్లూరు నగరం కొండయ్యపాలెం గేటు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కోస్తా ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ, జిల్లా ఇన్‌ఛార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగలు పాల్గొని మాట్లాడారు. మాదిగల విశ్వరూప మహాసభకు ముఖ్య అతిధిగా ప్రధాని నరేంద్ర మోదీ రాక ఖరారు అయిందన్నారు. సభ పరేడ్ గ్రౌండ్ మాదిగ బిడ్డల కవాతు కోసం ఎదురు చూస్తుందన్నారు. ఊరు వాడ కదలాలి. ప్రతి ఇల్లు తరలాలి. ప్రపంచమే మన వైపు చూసేలా మన శక్తి ప్రదర్శన జరగాలని పిలుపునిచ్చారు. 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ ఆకాంక్షను నెరవేర్చేందుకు ఈ తరాలకు వచ్చే తరాల బిడ్డలకు భవిష్యత్తును అందించేందుకు రిజర్వేషన్ల కోటాలో న్యాయమైన వాటా కోసం రాజకీయాలకు అతీతంగా జెండాలకతీతంగా జాతి యావత్తును సభకు సిద్ధం చేయండి.. జాతిలో పుట్టిన బిడ్డగా అది మన బాధ్యత అని గుర్తించండని అన్నారు. అందరితో మాట్లాడండి ప్రతి ఒక్కరూ కదలాలని దేశ ప్రధాని నరేంద్ర మోదీకి మాదిగ ఉపకులాల ఆవేదనను తెలియజేసే విధంగా మన సంకల్ప బలాన్ని బలంగా ప్రతి ఒక్కరూ ఇళ్లకు తాళాలు వేసి సభకు మాదిగలు ఉప్పెనలా తరలి వచ్చేలా ఎక్కడికక్కడ వాహనాలను సిద్ధం చేయాలని ఇది ఒక బాధ్యతగా ఉద్యమంలో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గోసాల సుధాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ, ఎంఎస్పీ జిల్లా కోకన్వీనర్ కోగళ్లగట్ల రమేష్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా గౌరవ అధ్యక్షులు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, ఎంఎస్పీ మహిళా ఇన్‌ఛార్జి గేరా జానకి, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తాళ్ళూరి శేషయ్య మాదిగ, అక్కిలగుంట ఏసు మాదిగ, తాటిపర్తి లక్ష్మయ్య మాదిగ, బద్దెపూడి వివేక్, చింతకుంట అంకయ్య, చిడతల శ్రీనివాసులు, ఏసుపోగు జయరాజ్, కత్తి శివయ్య మాదిగ, కావలి శ్రీను, మహిళా నేత వడ్లపల్లి రమణమ్మ, ఐమూరి మహేష్ మాదిగ, చిడదల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో డిఈవో ఆకస్మిక పర్యటన

ఉదయగిరి,నవంబర్2,ప్రభాతవార్త ఉదయగిరి మండలం కృష్ణంపల్లి ప్రభుత్వ పాఠశాలను డివిజనల్ డిఈవో పి.రఘురామయ్య వార్షిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాల యొక్క ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని అకాడమిక్,నాన్ అకాడమిక్ కార్యకలాపాలను,పాఠశాల అభివృద్ధికి అవసరమైన విద్యాపరమైన సూచనలు తదితర విషయాలను గూర్చి ఉపాధ్యాయులతో చర్చించారు.పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను ప్రసంశిస్తూ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల ఎంఈవో షేక్.మస్తాన్‌వలీ,ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ శివరామిరెడ్డి,బసినేనిపల్లి పాఠశాల ఉపాధ్యాయులు అంజయ్య,గండిపాలెం స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు,ప్యానల్ మెంబర్స్ తదితరులు పాల్గొని డిఈవో పి.రఘురామయ్యను శాలువాలు కప్పి సత్కరించారు. స్కూల్ సిబ్బంది,తోటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాడుబడిన పాఠశాలను బాగుచేయండి

**ఉదయగిరి,నవంబర్2,ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని గండిపాలెం రామాలయం దగ్గర ఉన్న ప్రభుత్వం పాఠశాల నిర్మించి ఎన్నో సంవత్సరాలు కావడం వల్ల నడే శిధిలావస్తలో ఉందని రూమ్‌లలో గల స్లాబ్ పెచ్చులు ఊడి విద్యార్థుల మీద పడే ప్రమాదం ఉందని స్కూల్ టీచర్ తెలిపారు.ఈ పరిస్థితిపై వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి,మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య సంబంధిత అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోవడంతో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయ కర్త రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు.గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి మాట్లాడుతూ తనకు అవకాశం కల్పిస్తే తన సొంతనిధులతోనైనా కొత్త భవనం నిర్మించి విద్యార్థులకు అందిస్తామని తెలిపారు.శిదిలావస్తలో ఉన్న స్కూల్ భవనం స్థానంలో కొత్త భవనాన్నినిర్మించి పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కలగకముందే తగిన చర్యలు తీసుకోవానలి విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన గుంజి



**నెల్లూరు నవంబర్ 2, ప్రభాతవార్త-వైద్యం** రూరల్ నియోజకవర్గం, సౌత్‌మోపూరు గ్రామానికి చెందిన గుంజి రవి వారి మిత్రులతో కలిసి తెలుగుదేశం పార్టీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీలో నేను రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు నాగెలుపు కోసం రవి చురుకుగా పనిచేశాడన్నారు. రవి నిండు మనస్సుతో టీడీపీలో చేరిన దానికి సాదరంగా తాను స్వాగతం పలుకుతున్నానన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు. కన్వీరన్ పముజుల ప్రదీప్, రాపూరు శేఖర్, తుళ్లూరు రామయ్య, ఆలకుంట శీను, రాపూరు కాళయ్య, భాగం శ్రీనివాసులు, చల్లా లక్ష్మయ్య, గుంజి సునీల్, ఆలకుంట మోహన్, అచ్చి రోహిత్, చల్లా చిన్నయ్య, గుంజి విజయ్, బండి వేణు, మల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం



**ముత్తుకూరు,నవంబర్2,ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని,మా ఒంట్లో తుదిశ్వాస ఉన్నంతవరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని నెల్లూరులోని రామచంద్ర హాస్పిటల్లో చికిత్స పొందుతున్న సింగిరి జయమ్మ,పర్వతాల సీనయ్య క్యాన్సర్ హాస్పిటల్లో చికిత్స తీసుకుంటున్నారు. మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకురావడం వల్ల మాకు మేలు జరుగిందని,వాలంటీర్లు తమ వద్దకు వచ్చి పెన్షన్ఇవ్వడం జరిగిందన్నారు.బ్రహ్మదేవం1, వాలంటీర్ మల్లేశ్వరిని అభినందించారు.ఇంత దూరం తమదగ్గరకు వచ్చి పెన్షన్లు ఇచ్చిన ప్రభుత్వం ఏదిలేదన్నారు.గతంలో పెన్షన్‌కోసం అధికారుల చుట్టూ తిరిగేవారమని ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు.వాలంటీర్ మల్లేశ్వరిని స్థానిక ప్రజాప్రతినిధులు,పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

## ఆత్మకూరులో ఘనంగా గౌతంరెడ్డి జయంతి వేడుకలు



**ఆత్మకూరు, నవంబర్2, ప్రభాతవార్త** :స్వర్గీయమంత్రి మేకపాటి గౌతంరెడ్డి 52వ జయంతి వేడుకలు ఆత్మకూ రు పట్టణంలో గురువారం ఘనంగా జరిగాయి . ఈసందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ , నెల్లూరుపాళెం సెంటర్ వద్దనున్న గౌతంరెడ్డి విగ్రహాల వద్ద వైసిపి నాయకులు ఘన నివాళులు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గౌతంరెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్ర మం లో ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జెజిఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేష య్య, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, నెల్లూరుపాళెం వార్డ్ కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, నాయకులు నోటివినయ్‌కుమార్‌రెడ్డి, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, పాల్గొన్నారు.

## మర్రిపాడులో ఘనంగా గౌతంరెడ్డి జయంతి వేడుకలు

**మర్రిపాడు, నవంబర్2, ప్రభాతవార్త** : మర్రి పాడు మండలంలో దివంగత మంత్రి మేక పాటి గౌతంరెడ్డి 52వ జయంతి వేడు కలను గురువారం ఘనంగా నిర్వహిం చా రు. మండలంలోని పలు గ్రామాల్లో గౌ తంరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవల ను కొనియాడారు. మండలంలోని రాంపల్లి లో స్థానిక వైసిపి నాయకులు ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.

## శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ కుట్టు శిక్షణా కేంద్రానికి మూడు కుట్టు మిషన్లు వితరణ



**కావలి, నవంబరు 2 ప్రభాతవార్త** ప్రవాస భారతీయుల సహకారంతో కావలి పట్టణంలో శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి మూడు కుట్టు మిషన్లు దాతలు వితరణ చేశారు. కుట్టు శిక్షణా కేంద్రానికి అండగా తమ వంతుగా అమెరికాలో వుంటున్న కేతు శశికాంత్, కేతు లతలు ఈ కేంద్రానికి అవసరమైన మూడు కుట్టు మిషన్లు పంపించారు. కొన్ని సంవత్సరాలుగా కావలిలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వారికి వృత్తి పరంగా నైపుణ్యం కల్పిస్తున్న శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవికి తమవంతు సహకారం ఇచ్చే క్రమంలో ఈ మిషన్లను అందజేసినట్లు దాతలు తెలిపారు.కావలిలోని పేద, మధ్యతరగతి మహిళలకు అండగా కుట్టుమిషన్లు అందజేసిన దాతలకు ట్రస్ట్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## యూనివర్శిటీ స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన డిబిఎస్ విద్యార్థిని జి.అఖిల



**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** యూనివర్శిటీ స్థాయిలో కబడ్డీ పోటీలలో కావలి డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని జి.అఖిల ప్రతిభను చాటిచెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడారు. తిరుపతి పట్టణంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన యూనివర్శిటీ స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీలలో తమ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న నెల్లూరు జిల్లా మైపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని జి.అఖిల రాణించి డిబిఎస్ కళాశాల కీర్తిని ఎగురవేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆటలు ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయన్నారు. విద్యార్థిని అఖిలను జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అఖిలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ అన్ని రంగాలలో విద్యార్థినులు ముందంజలో వున్నారన్నారు. ఆటల్లో రాణిస్తున్న తమ కళాశాల విద్యార్థిని జి.అఖిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎవో జి.రమేష్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్ దాసరి శివసాగర్‌కుమార్, డిప్లమా ఫిజికల్ డైరెక్టర్ బి.రాంబాబు, అన్ని విభాగాల ధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నలుగురితో సంతోషాల్ని పంచుకోవడం నేరమా?



**కలిగిరి, నవంబర్ 2, ప్రభాతవార్త**;మాజీ ముఖ్యమంత్రి జైల్‌నుండి బెయిల్‌పై వచ్చిన సందర్భంగా తెలుగుదేశంపార్టీ నాయకులు సంతోషాన్ని నలుగురితో పంచుకోవడం నేరమా అంటూ తెలుగుదేశంపార్టీ ఉదయగిరి ఇన్చార్జీ బొల్లినేని వెంకట రామారావు ప్రశ్నించారు.బొల్లినేని విలేఖర్లతో మాట్లాడుతూ అక్టోబం 31వ తేదీన చంద్రబాబు బెయిల్‌పై బయటకు వచ్చిన సందర్భంగా జలదంకి మండల బస్టాండు సెంటర్లో స్వీట్లు సంచు కొని ఆనందాలు వక్తం చేసుకుంటున్నారన్నారు.అప్పుడే అటుగా వచ్చిన జలదంకి యస్ఐ రోడ్డుపై సంబరాలు చేసుకోవడానికి పోలీసు పర్మిషన్ తీసుకోలేదని, ఇక్కడ నినాదాలు చేయరాదన్నారు. దానితో తాముకూడా వైసిపి వాళ్లకు ఒక రూలా మాకు ఒక రూలా అంటూ మాట్లాడినందుకు మాపై కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. తాము ఉదయగిరి యంఎల్ఏగా ఉండగా ఇలాంటి కష్టసాదింపు చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదన్నారు.

## మనుము పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



**కలిగిరి, నవంబర్02, ప్రభాతవార్త**;కలిగిరి మండలంలో రైతులు వేసిన మినుము పంటను జిల్యావ్యవ సాయాధికారులు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూరెండు నెలలక్రితం వేసిన మినుము పంట వర్షాలు లేక పెరుగుదల లేకుండా పోయిందన్నారు.ఇకనైనా వర్షాలుపడకపోయినట్లైయితో మండలంలో వేసిన 350 ఎకరాల మినుము దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాదికారి సుదాకర్ రావు, జిల్లా వ్యవసాయ సంచాలకులు నర్సోజీ రావు,మండల అధికారులు యం. సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా టపాసుల దుకాణాలు నిర్వహిస్తే చర్యలు



సంగం నవంబర్ 2 ప్రభాతవార్త దీపావళి పండుగ పురస్కరించుకొని టపాసులు దుకాణాలు నిర్వహించే వారు తప్పకుండా లైసెన్స్‌లు పొందాలని లేని పక్షంలో వారిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసిల్దారు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శివాలయం సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆత్మకూరు ఆర్‌డిఒ ఆదేశాల మేరకు నిబంధనల మేరకు టపాకాయాల దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో విఆర్ఒ రవిబాబు తదితరులున్నారు.

## గోవింద స్వాములకు సంఘీభావం తెలిపిన కొండ్రెడ్డి



నెల్లూరుసిటీ,నవంబర్2,ప్రభాతవార్త గోవిద మాలధారణ చేసిన గోవింద స్వాములకు నెల్లూరు విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సంఘీభావం తెలిపారు.నెల్లూరు రూరల్ నియో జకవర్గం 23వ డివిజన్ పడారుపల్లిలో వెలిసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుండి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు పాద యాత్రగా బయలుదేరుతున్న గోవింద స్వాములకు గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న కొండ్రెడ్డి రంగారెడ్డి పాదయాత్ర సమయంలో గోవింద సాములు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.9వ పాదయాత్ర కార్పొరేటర్ దుద్దగుంట శ్రీనివాసు లురెడ్డి(ఒరిస్సా) ఆధ్వర్యంలో భక్తజనులు పూలమాలలతో హోరెత్తించారు.అనతరం గోవింద స్వాములకు సంఘీ భావం తెలియజేసి స్వాములకు తగిన జాగ్రత్తలు సూచించి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీ అందరిపైఉండాలని మనసారా ఆ దేవుడిని ప్రారించు చున్నానని విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.

## అన్యాయంగా తొలగించారంటు షిఫ్ట్ ఆపరేటర్ ఆందోళన

**మనుబోలు, నవంబర్2, ప్రభాతవార్త**:మండలంలోని ఎపిఎస్‌పిడిసిఎల్ వీరంపల్లి సబ్‌స్టేషన్‌లో 9సంవత్సరాలుగ పనిచేస్తున్న తనను అన్యాయంగ తొలగించారంటు షిఫ్ట ఆపరేటర్ చిట్టేటి బానుచందర్ ఆందోళన వ్యక్తంచేశాడు.గురువారం మీడియాఎదుటకు పంపిన ప్రకటనలో తనకు జరిగిన అన్యాయాన్ని తెలియజేశాడు.తాను యానది కులానికి చెందిన వాడనని తనకు భార్య ఇద్దరు చిన్నపిల్లలున్నారని తాను లక్షణంగ ఈఉద్యోగం చేపుకుంటు బ్రతుకుతుంటే అన్యాయంగ తొలగించారని చెప్పాడు.వీరంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తినే షిఫ్ట్ ఆపరేటర్‌గపెట్టి కటిక పేదవాడినైన తనను తొలగించడం పట్ల చిట్టేటి బానుచందర్ విచారం వ్యక్తంచేశాడు.తమ శాఖకు చెందిన డి.ఇ,ఇ.ఇతన ప్రవర్తన బాగలేదన్న అబాండంమోపి తనను తొలగించడం పట్ల నిరసన వ్యక్తంచేశాడు.ఉన్నతాదికారులు తన విన్నపాన్ని మన్నించి షిఫ్ట ఆపరేటర్ ఉద్యోగాన్ని ఇవ్వాలని బానుచందర్ విజ్ఞప్తిచేశాడు.

## ఉదయగిరిలో మేకపాటి గౌతమ్ రెడ్డి జయంతి వేడుకలు

**ఉదయగిరి, నవంబర్2, ప్రభాతవార్త** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి మండలంలో దివంగత శాసనసభ్యులు,మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి 53వ జయంతిని మండల కన్వీనర్ సి.ఎమ్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మేకపాటి కుటుంబం ఉదయగిరి అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని అందులో భాగంగా మంత్రివర్యులు మేకపాటి గౌతమ్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కొరకు ఎన్నో పెట్టుబడులు సాధించి కంపెనీల ద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించే విధంగా ఉద్యోగాలు సృష్టించారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఉదయగిరిలో నిర్వహించడం జరిగిందని ఈ సందర్భంగా 80మంది అనాదపిల్లలు ఉన్న స్కూల్ విద్యార్థులకు భోజనవసతి కల్పించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉదయగిరి వైసీపీ నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## ఉదయగిరిని జిల్లాగా మార్చండి

**ఉదయగిరి, నవంబర్2, ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరి వెనుకబడిన మెట్ట ప్రాంతం అభివృద్ధికి నోచుకోని ప్రాంతంగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక ప్రజలు వలసబోతున్న ఉదయగిరిని జిల్లాగా చేయాలని ఉదయగిరి జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ వేణు ఈ సందర్భంగా తెలిపారు.ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లె గ్రామంలో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ ఉదయగిరిని జిల్లా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా ఏర్పడితే ప్రజల తలరాతలు మారతాయని ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవిన విధానం మారుతుందనితెలిపారు.విద్యా రంగంలోనూ వ్యవసాయ,నీటి పారుదల,పెట్టుబడుల కంపెనీల విషయాలలో ఎంతో వెనుకబడి ఉదయగిరి తీవ్ర నష్టాన్ని చవిచూస్తుందని ఈ విషయం ప్రజలకు తెలిసి ప్రజలను చైతన్యపరిచి ఉద్యమంలా ఉదయగిరి జిల్లాను సాధించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.ప్రతి రోజూ మండలంలో ఏదో ఒకచోట ప్రజలకు సమావేశం ఏర్పరిచి ఉదయగిరి జిల్లా యొక్క అవసరాలను వారికి తెలియజేస్తూ ముందుకు సాగుతున్నామని రాజకీయ నాయకులే కాకుండా విద్యావంతులు,మేధావులు,ఆలోచనలు చేసి ఉదయగిరి జిల్లాను సాధించుకోకపోతే భవిష్యత్తులో రాబోయే యుగానికి చెడుచేసిన వారమవుతామని వారు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు,విద్యావంతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, రవీంద్రలపై మద్యంకేసు పెట్టడం సిగ్గుచేటు

**నెల్లూరు నవంబర్ 2, ప్రభాతవార్త-వైద్యం** మద్యంపై వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుంటూ చంద్రబాబునాయుడు, కొల్లు రవీంద్రలపై తప్పుడు మద్యం కేసులు పెట్టడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి గంజాం రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. నాలుగున్నరేళ్ళుగా కల్తీ మద్యాన్ని అమ్మడమే కాకుండా, దానిపై లక్షలాది కోట్లు దోచుకుని, దాచుకున్న జగన్ చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందంటూ కేసు పెట్టడం హేయమన్నారు. కావాలనే ప్రజలలో టీడీపీకి వస్తున్న జనాధరణ చూసి ఓర్వలేకే చంద్రబాబు, కొల్లు రవీంద్రలపై కేసు పెట్టించారని రాఘవేంద్ర ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చిననాటి నుంచి యువతను మత్తు పదార్థాలకు బానిసలు చేసి వారి జీవితాలను నాశనం చేశాడని మండిపడ్డారు. రాష్ట్రంలో భూమి, ఇసుక, మైనింగ్, మద్యం, గంజాయి మాఫియాగా మార్చేశాడన్నారు. తాను అధికారంలోకి మద్యపాన నిషేదమని చెప్పి, నేడు గ్రామాల్లో అడుగడుగునా బెల్టుషాపులు జగన్ నడిపిస్తున్నాడన్నారు. కల్తీ బ్రాండ్లను అమ్ముతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాడన్నారు. ప్రశ్నిస్తే ప్రశ్నించిన వారిని గొంతు నొక్కేందుకు అక్రమ అరెస్టులు చేయించి, జైళ్ళకు పంపుతూ జగన్ సైకో ఆనందాన్ని పొందుతున్నాడన్నారు. ఈ సైకో జగన్‌కి త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. టీడీపీ గెలుపుకోసం ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక్కో సైనికుడులాగా పనిచేసి చంద్రబాబుని సీఎంని చేసుకోవాల్సిన అవసరం ఆసన్నమౌతోందన్నారు.

## బాబుకు బెయిల్, అయ్యప్ప మాల ధారణ



**నెల్లూరు నవంబర్ 2, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు బెయిలు వస్తే అయ్యప్ప మాల వేసుకుంటానని మొక్కుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి నవీన్, గురువారం అయ్యప్ప మాల వేసుకున్నారు. అతనితోపాటు మరో 40మంది అయ్యప్ప మాలలు వేసుకున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుని జగన్ అక్రమంగా జైల్లో పెట్టించినా చివరకు న్యాయమే గెలిచిందన్నారు. కోట్లాదిమంది తెలుగు ప్రజల ప్రార్థనలు ఫలించాయని ఆ దేవదేవుడు వెంకటేశ్వరస్వామి మా మొర ఆలకించి చంద్రబాబుకి బెయిలు వచ్చేలా దీవించారన్నారు. నవీన్‌తోపాటు చంద్రబాబు కోసం మరో 40మంది మాలధారణ చేయడం ఎంతో సంతోషకంగా ఉందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని కోటంరెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి - ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



**ఆత్మకూరు, నవంబర్2, ప్రభాతవార్త** : స్వర్గీయ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి 52వ జయంతి సందర్భంగా ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మెగా జాబ్‌మేళాను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్ప నే ధ్యేయంగా ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నా మన్నారు.



నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వి నియోగం చేసు కోవాలని ఆయన కోరారు. మె ట్టప్రాంత యువతకు పెద్ద ఎ త్తున ఉద్యోగాలు ఇవ్వాలన్నదే గౌతమన్న ఆశయమన్నారు. అన్న ఆశయాలను, అన్న కలలను నిజం చేస్తామన్నారు. యువత ఉద్యోగ కల్పనకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం గౌతమన్న జయంతి నాడు జాబ్‌మేళాను నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గస్థాయిలో ఇప్పటివరకు 2జాబ్‌మేళాలు నిర్వహించి వం దలాది మంది యువతీ యువకులకు ఉపాది కల్పించామన్నారు. దూరం, భారం అనేవి వదిలేసి రాజీపడకుండా నిరుద్యోగ యువత కృషి చేస్తేనే ఉద్యోగం సాధ్యమవుతుందన్నారు. ఉద్యోగ అవకాశాలు రావడం అంత సులభం కాదని యువత ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. రెండు నెలలుగా క్షేత్ర స్థాయిలో కసరత్తు చేసి జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. ఫార్మా , ఫుడ్ ప్రాసెసింగ్, ఐటి, నైపుణ్య రంగాలకు చెందిన 30సంస్థలు జాబ్‌మేళాలో భాగస్వామ్యమయ్యాయన్నారు. జాబ్‌మేళా నిర్వ హణపై ఫీడ్‌బాక్ తీసుకొని యువతకు ఎక్కడ ఇబ్బంది ఉందో గుర్తించి వారిని పరిశ్రమలకు తగినట్లు సన్ని ద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2వేల ఉద్యోగాలిచ్చే జాబ్‌మేళాను ఇంత పెద్ద స్థాయిలో నిర్వహించేందుకు సహకరించిన వారికి , ఆంధ్రా ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మకూరు, జిల్లాస్థాయిలో జాబ్‌మేళాలో నమోదైన యువత వివరాలను పరిశీలించి జాబ్‌మేళా తర్వాత ఉద్యోగాలు వచ్చిన వారు తృటిలో అవకాశం చేజారిన వారిని గుర్తించి మరో అవకాశం ఇప్పిం చేందుకు కృషి చేస్తామన్నారు. శిక్షణ అందించగలిగితే ఉద్యోగం సాధించే కలిగే అవకాశం ఉన్నవారికి పరిశ్ర మల ద్వారా నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత, మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావ్, మున్సిపల్ చైర్మెన్ గోపవరం వెంకటరమణమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మెన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ఆత్మకూరు ఎంపిపి కేతా వేణుగో పాల్‌రెడ్డి, వైసిపి నాయకులు ఇందూరు వెంకటరమణారెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, కాటంరెడ్డి నర్సింహారెడ్డి, సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత , వైసిపి నాయకులుపాల్గొన్నారు. ఈ ఉద్యోగ మేళాకు భారీ స్థాయిలో నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అద్భుతమైనది చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ



**బుచ్చి నవంబర్ 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని 17,18 వార్డులలో కౌన్సిలర్ మోర్ల జయంతి,మోర్ల భరత్ గుంటూరు వెంకటేశ్వర్లు,నేతృత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గోన్న మోర్ల సుప్రజ మాట్లాడుతు ఆంధ్రరాష్ట్రాన్ని ఆరోగ్య రాష్ట్రంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని అన్నారు.కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నేతృత్వంలో బుచ్చి మున్సిపాల్టీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.పేదలకు స్పెషలిస్టు డాక్టర్ల చేత వైద్యం అందించడమే కాక వారికి ఉచితంగా మందులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో భాగంగా అంగన్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆమె సందర్శించి వారు చేసిన పదార్థాలు రుచి చూసి వారిని అభినందించారు.ఈకార్యక్రమంలో నగరవైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లిలితారెడ్డి , వైస్ చైర్మన్ షేక్ షాహుల్, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి కౌన్సిలర్లు షేక్ షకిలాబేగం, పఠాన్ నస్రీన్,రాచూరు సత్యనారాయణ, బి.మల్లారెడ్డి, కంఠా అనంతమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ, డాక్టర్ అల్లాబక్ష్, పెంచలయ్య, డాక్టర్లు,సచివాలయ సిబ్బంది,వాలింటర్లు పాల్గోన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకోవాలి



**కావలి, నవంబరు 2 ప్రభాతవార్త** ఇంటి వద్దకే వైద్యాన్ని అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి తెలిపారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డు అంకమ్మ గుడి సెంటర్ వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదిలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలను, వృద్దులను, బాలింతలను పలకరించి వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లను మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అనంతరం బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలియజేయాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా వుండాలన్నదే సియం జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, వైసిపి నేతలు పొనుగోటి అనూరాధ, పులి రజని, కనపర్తి రాజశేఖర్, దామిశెట్టి సుధీర్‌నాయుడు, డాక్టర్లు, వైద్య సిబ్బంది,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేకపాటి గౌతంరెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొన్న మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్2, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి ,ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దివంగత మేకపాటి గౌతంరెడ్డి జయంతి సందర్భంగా స్థానిక డైకాస్ రోడ్డు కూడలిలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన వారి క్యాంస విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించిన ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి,శా సనసభ్యులుగా గౌతంరెడ్డి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు.ఉన్నత వ్యక్తిత్వం,క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి స్నేహపూర్వక రాజకీయాలను గౌతంరెడ్డి ప్రోత్సహించేవారని ప్రశంసించారు.గౌతమ్‌రెడ్డి ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేద్దామని యేయర్ ఆకాంక్షించారు.

## కావలి రూరల్ మండలంలో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలంలో పలువురిని గురువారం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. తుమ్మలపెంట గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటంగారి గోవిందు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే కొత్తసత్రం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కాటంగారి పామంజి శేషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.వారి ఇళ్లకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అండగా వుంటానని భరోసాఇచ్చారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ నాయుడు రాంప్రసాద్, వైసిపి నాయకులు దామిశెట్టి సుధీర్‌నాయుడు, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొత్తసత్రంలో పడవను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



**కావలి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా కావలి రూరల్ మండలం కొత్తసత్రం గ్రామానికి చెందిన కొనపూడి శ్రీనుకు పడవను మంజూరు చేశారు. కొత్తసత్రం సముద్ర తీరాన వున్న ఈ పడవను గురువారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కొత్త పడవను చూసిన శ్రీను ఆనందానికి ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, గ్రామ కాపులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## టి.డి.పి నేతలపై కేసు నమోదు

జలదంకి,నవంబర్2,ప్రభాతవార్తఃఉదయగిరి మాజీ ఎం.ఎల్.ఎ బొల్లినేని వెంకటరామారావు,మరో 11మంది తెలుగుదేశం నేతలపై కేసు నమోదుచేసినట్లు ఎస్.ఐ ఆదిలక్ష్మి తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జైలునుంచి విడుదలైన సందర్భంగ గత మూడురోజులక్రితం జలదంకిలో వారు సంబరాలు జరుపుకుంటు పోలీస్ విధులకు ఆటంక కలిగించడం,దురుసుగ ప్రవర్తించడం వంటివాటితో ఈకేసు నమోదుచేసినట్లు వివరించారు.